ప్రజాశక్తి
శనివారం 11 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



ఓటమి భయంతోనే వైసిపి ప్రలోభాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఓటమి భయంతోనే వైసిపి అభ్యర్థి ప్రలోభాలకు పాల్పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరుగునున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి బలపరుస్తున్న అభ్యర్థి ఓటమి భయంతోనే ఉద్యోగులను, సచివాలయ సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అంతేకాక గ్రామాల్లో గ్రామ నాయకులతో రకరకాల ప్రలోభాలకు నిరుద్యోగు యువత ఓట్లకు నోట్లు వెరవేసే ప్రయత్నంలో ఉన్నారన్నారు. అలాగే ఉద్యోగులకు భయభ్రాంతులకు గురి చేసి ఒత్తులు చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. అధికార పార్టీ దుర్వినియోగం చేస్తుందని, వీటిపై నిఘా పెట్టి అక్రమాలను ఆపాలన్నారు. ఇప్పటికే రకరకాల హామీలతో మంత్రులు, ఎమ్మెల్యేలు నిరుద్యోగులకు, ఉద్యోగులకు గాలం వేస్తున్నారని దీన్ని పట్టభద్రులు ఆలోచించి విజ్ఞప్తి ఆలోచించి ఓటు వేయాలన్నారు.

ప్రశ్నించే గొంతునే గెలిపించండి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడి, ప్రజా సమస్యలపై అనునిత్యం ప్రశ్నించే గొంతుక డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపే బాధ్యత అందరిపైనా ఉందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బరావమ్మ అన్నారు. శుక్రవారం సాలూరులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వానికి ఎదురు తిరిగి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను విధానాలను ప్రశ్నించకుండా మౌనం వహిస్తున్నారని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ పోరాడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, ఎఐటియుసి నాయకులు రామచంద్రరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రచార చేపట్టారు. వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ, కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభని గెలిపించుకోవాలని కోరారు. ప్రచారంలో సిఐటియు నాయకులు దావాలా రమణారావు, బివి రమణ పాల్గొన్నారు.

రమాప్రభకు మద్దతుగా ముమ్మర ప్రచారం

సాలూరులో ప్రచారం చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజా సంఘాల విజ్ఞప్తి

కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రచార గోడపత్రికలను ఆవిష్కరణ చేశారు. ఈ ఆవిష్కరణలో ప్రజాసంఘాల నాయకులు వై.మన్మధరావు, జి.వెంకటరమణ, జీవ, మరిశర్ల సత్యంనాయుడు, శాంతి, తులసి, వి.ఇందిరా, బి.సూరిబాబు, మామిడి శ్రీను, బంటు ప్రవీణ్, సింహాచలం, రాజు, రాజశేఖర్, ఎల్ఐసి పార్వతీపురం బ్రాంచ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి, బికెఎంయు, డిహెచ్‌పిఎస్ ప్రచారం

పార్వతీపురం టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి టి.జీవ, బికెఎంయు జిల్లా కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు మండంగి సింహచలం, సీనియర్ నాయకులు సత్య ప్రసాద్ ప్రకటనలో కోరారు. పట్టణంలో ప్రధాన రహదారి గుండా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు.

మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నాడు హామీలు... నేడు వేధింపులా?

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్

అధికారంలో రాకముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చి..నేడు వారిని వేధింపులకు గురిచేయడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు అన్నారు. ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి, మెరుగైన పిఆర్‌సిని తీసుకువస్తానని నమ్మించి, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేయకపోగా జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చారని అన్నారు. శుక్రవారం మన్యం జిల్లా కలెక్టర కార్యాలయం గేటు ఎదుట, ఉపాధ్యాయులంతా ఉరితాలకు వేలాడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మురళీ మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను నిరంతరం వేధిస్తోందని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తామని చెప్పినా నేటివరకు పట్టించుకోవడంలేదని అన్నారు. హక్కుల గురించి అడిగితే ఉపాధ్యాయులపై ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలు చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిం చాలని, లేని పక్షంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, సహాధ్యక్షులు విజయ్ కుమార్, జ్యోతి, కోశాధికారి మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని ఐఎండి ఆదేశాలు జారీ చేసిన దృష్ట్యా ముందు జాగత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం వైద్య, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఇతర పథకాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వేసవి తీవ్రతను ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఒఆర్ఎస్, జింక్, పారాసెటమాల్ వంటి అన్ని అవసరమైన మందులు ఆశా వర్కర్ స్థాయి నుంచి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరు నిశాంత్‌కుమార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నిర్మాణ పనుల బిల్లులను వెంటనే పంపించాలని తెలిపారు. సచివాలయ ఇంజనీరింగు అసిస్టెంట్లు, మహిళా పోలీసు, వెల్ఫేర్, ఎడ్యుకేషను అసిస్టెంట్లు వారి లక్ష్యాల మేరకు పాఠశాలలను సందర్శించి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎన్.సి.డి./ సి.డి. సర్వే నిర్వహించాలన్నారు. ఇరిగేషనుకు సంబంధించి 50 ఎకరాలకు నీరందించే మైక్రో ఇరిగేషను ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అవసమైన ప్రణాళిక సిద్ధం చేయాలని, మంచినీటి సరఫరా పథకాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫ్లూ పట్ల అప్రమత్తం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కలెక్టరేట్

దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని, కానీ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు తెలిపారు. తాజా కేసులకు చాలా వరకు ఇన్ఫ్యూయెంజా ఎ - ఉప రకం 'హెచ్ 3ఎన్2' వైరస్ కారణమని గుర్తించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) తెలిపిందని పేర్కొన్నారు. ఇతర ఉపరకాలతో పోలిస్తే ఈ వైరస్ ప్రభావం ఎక్కువని, సాధారణ జ్వరంతో పాటు నిరంతరం దగ్గు రావడం, కొందర్లో శ్వాస కోశ సమస్యలు ముఖ్య లక్షణాలుగా తెలిపారు. 'వైరల్ జ్వరాలు ఎక్కువ శాతం పిల్లల ద్వారా కుటుంబంలోని అందరికీ ఈ లక్షణాలు వ్యాప్తి చెందుతున్నాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఫ్లూ సోకిన పిల్లల్ని ఇంట్లోనే ఉంచాలని, బయటకు పంపరాదని సూచించారు. దీనివల్ల ఫ్లూ వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ఈ ఇన్ఫెక్షన్ సాధారణంగా ఐదు నుంచి ఏడు రోజుల్లోపే తగ్గిపోతుందని, సీజనల్ జ్వరాలు మూడు రోజుల్లోనే తగ్గితే.. దగ్గు మాత్రం మూడు వారాల వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫ్లూ బారిన పడిన రోగులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. తుమ్మినా, దగ్గినా ముఖానికి చేతి రుమాలు అడ్డు పెట్టుకోవాలన్నారు. చేతులను క్రమం తప్పకుండా సబ్బుతో కడగాలని, లక్షణాలు ఉన్నవారు మాస్కులు ధరించాలని, వీలైనంత ఎక్కువగా ద్రవ పదార్థాలను తాగాలని, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలుంటే పారాసెటమాల్ తీసుకోవాలని సూచించారు.

ప్రలోభాలే అజెండా

- ప్రజా సమస్యల ఊసే లేదు
- ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా ప్రశ్నించని వైసిపి
- సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రుల ఓట్లడిగే హక్కుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైసిపి తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి బరిలో దిగిన సీతంరాజు సుధాకర్‌కు అధికార పార్టీ జెండా నీడ తప్ప ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా సమస్యల పట్ల ఎలాంటి అవగాహనా, అజెండా లేదు. పోరాటం చేసిన ఒక్క సందర్భమూ లేదు. ఆయనకు ఓట్లు అడిగే హక్కు ఇంకెక్కడిది' అని పలువురు పట్టభద్రులు బాహాటంగా చెప్పేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల్లోనూ దీనిపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోటీలో ఉండాలంటే పార్టీ మద్దతు ఒక్కటేనా ఇతర గుణగణాలేవీ అవసరం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ వాటి పురోభివృద్ధికి పార్టీ జెండా నీడన ముందుకెళ్లి పోవాలనుకునే నేతల్లో ఆయనొకరని చెప్పుకుంటున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రైవేటీకరణ చేస్తున్నా నోరుమెదపని వైనం సదరు అధికార అభ్యర్థి సొంతం. వేల సంఖ్యలో కార్మికులు, కార్మిక కుటుంబాలే కాకుండా ప్లాంట్‌పై ఆధారపడి జీవించే వేల కుటుంబాలు, వ్యాపారాలు విశాఖపట్నం ప్రత్యేకత. ఇలాంటి ప్రత్యేక పరిస్థితి చేజారిపోతున్నా పట్టని అధికార వైసిపిలో ఉన్న సదరు అభ్యర్థి స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారనే చెప్పాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మాలని మోడీ సర్కారు కుట్రలపై కుట్రలు సాగిస్తున్నా ఉత్తరాంధ్ర పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నిస్తానని ప్రకటించిన దాఖలా లేదు.

సమస్యలపై ఏనాడూ గళమెత్తని అభ్యర్థి

విశాఖకు అత్యంత కీలకమైన రైల్వే జోన్‌పైనా కినుక వహించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసినా, ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక పరిపుష్టిని దెబ్బ తీసే చర్యలపైనా ఏనాడూ అధికార పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోకి దిగిన ప్రస్తుత అభ్యర్థి గళమెత్తలేదు. వెనుకబడిన జిల్లాలుగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ముద్రపడ్డ శ్రీకాకుళం, విజయనగరం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో కొంత ఆసరాగా నిలిచే విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ నగరంపై ఆధారపడి జీవించే వేల కుటుంబాల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలున్నాయి. ఈ తరహా ప్రజా సమస్యల అజెండాపై పిడిఎఫ్ అభ్యర్థి అయిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మినహా ప్రస్తుతం బరిలో నిలిచిన తెలుగుదేశం, వైసిపి, బిజెపి నేతలు పోరాడడం కాదు కదా కనీసం ఏ కోసానా స్పందించలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఉత్తరాంధ్రకు రూ.వేల కోట్లు ఆర్థిక ప్యాకేజీ కేంద్రంలోని బిజెపి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేసినా రాష్ట్రంలో 2019లో పగ్గాలు చేపట్టిన వైసిపి ఏనాడూ ప్రశ్నించలేదు. ఆ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఇవేమీ పట్టడమే లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏ ముఖం పెట్టుకుని వారిని అధికార వైసిపి ఓట్లడగడానికి వెళ్తోంది అంటూ పట్టభద్రులే ప్రశ్నిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రలోభాలు.. పంపకాలే

చేతిలో అధికారం ఉండడంతో ఉద్యోగులు, అధికారులపై బెదిరింపులకు పాల్పడడం, ఎయు వైస్ ఛాన్సలర్ హోటల్‌లో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సంఘాలకు దొరికిపోవడం తెలిసిందే. ప్రభుత్వ వైన్ షాపుల్లోని సూపర్ వైజర్లు సైతం అధికార పార్టీకి అనుకూలంగా ఓటు వేయాలంటూ శుక్రవారం సాయంత్రం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అధికార పార్టీ నేత కెకె.రాజు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించిన వీడియో బయటపడింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతటా తెలంగాణ రాష్ట్ర స్టిక్కర్లుండే కార్లను వినియోగించి వెండి వస్తువులను బహుమతులుగా శుక్రవారం సాయంత్రం సీతంరాజు సుధాకర్ తన ఇంటి నుంచి పంపిస్తున్న వీడియో, ఫొటోలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ అధికారిక అక్రమాలే. వీటన్నింటిపైనా జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

13న పోలింగ్‌లో బుద్ధిచెప్పడం ఖాయం

అధికార వైసిపి కేవలం తన శక్తియుక్తులన్నీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, డబ్బు, ఇతర బహుమతులను పంపిణీ చేసే అంశాలపైనే దృష్టిసారించింది. చెప్పడానికి అజెండా లేదు. దొడ్డిదారులు, దొంగ పనులపైనే ఆ పార్టీ కార్యాచరణ ఉన్నట్టు కనిపిస్తోంది. వాటిని పట్టభద్రులు చైతన్యంతో తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడికక్కడే వారి ఎత్తులను చిత్తు చేస్తున్నారు. పోలింగ్ రోజైన ఈనెల 13న ఇదే ప్రతిబింబించనున్నదని పలువురు చెబుతున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం వేధింపు చర్యలను మానుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన జిల్లాలోని పలు మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నాలు జరిగాయి. ఎన్నికలకు ముందు సిఎం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వేధింపుల చర్యలు మానాలని డిమాండ్ చేశారు.

సాలూరు: శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడారు. తొలుత వామపక్షాల ఆధ్వర్యాన పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీ నుద్దేశించి సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చాలా హామీలు ఇచ్చారని, అవేవీ నేటికీ అమలుకు నోచుకోలేదని అన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి మూడున్నరేళ్లయినా దాని ఊసే లేదని చెప్పారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయంలో వారు వున్నారని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల కు కూడా ప్రతినెలా ఒకటో తేదీ న జీతాలు అందే పరిస్థితి లేదన్నారు. మళ్ళీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిఎం జగన్ కళ్ళబొల్లి మాటలు చెప్పడానికి చూస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యోగులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ హామీ లను అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు పోరాడుతుంటే ప్రభుత్వం అణిచివేత చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. ఇలాంటి విధానాలను మానుకోవాలని సూచించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పట్టణ నాయకులు టి.శంకర్, టి.ఇందు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

సాలూరులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కొమరాడ : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు ఆపాలని స్థానికి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉపేంద్ర, రాము, పెంటయ్య, లక్ష్మణరావు, సుందరయ్య, వెంకటరావు, భీమయ్య, పోలయ్య పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, ప్రజా పోరాటాలపై నిర్బంధాలను ఆపాలని నిరసన కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సభ్యులు గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, రెడ్డి సత్యనారాయణ, బొరపురెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం :ఉద్యోగ, ఉపాధ్యాయులపై జగన్ ప్రభుత్వం వేధింపులు ఆపాలని, సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. ఉద్యోగుల జీతాలు సకాలంలో ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సకాలంలో వేతనాలు అందక ఉద్యోగులుపడుతున్న ఇబ్బందులను గుర్తించాలన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో సిఐటియు, రైతు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు, బి.గురుమూర్తి, అంపోలు నారాయణరావు, ఎస్.పూర్ణ, లక్ష్మి లక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

సీతానగరం, కొమరాడ, పాచిపెంట మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

వైసిపిలోనే మావుడి బ్రదర్స్

- రాజకీయ హైడ్రామాకు తెర
- సిఎం వద్దకు తీసుకెళ్లిన డిప్యూటీ సిఎం, జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ రాజకీయాల్లో సస్పెన్స్‌కు తెరపడింది. మక్కువ మండలానికి చెందిన మావుడి సోదరులు అధికారపార్టీలోనే ఉంటారు. గత కొద్ది రోజులుగా వారి కదలికలపై రకరకాల ఊహాగానాలు చెలరేగాయి. దీనికి కారణం ఇటీవల వైసిపి ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో బ్రదర్స్ పేరు లేకపోవడమే. గత కొంతకాలంగా మావుడి సోదరులు తమ కుటుంబానికి ఎమ్మెల్సీ పదవి కావాలని పట్టుబడుతున్నారు. కాంగ్రెస్ నుంచి వైసిపి వరకు వైఎస్సార్ కుటుంబానికి అండగా వుంటూ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ప్రధాన మద్దతుదారులుగా పనిచేస్తున్నారు. దీంతో మావుడి సోదరుల్లో ఒకరికి ఎమ్మెల్సీ ఇవ్వాలని డిప్యూటీ సిఎం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. అయితే ఉమ్మడి జిల్లా రాజకీయాలను గత కొంతకాలంగా శాసిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ , జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మావుడి సోదరులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరిన దాఖలాలు లేవు. దీంతో డిప్యూటీ సిఎం స్థాయిలో రాజన్నదొర సిఫార్సు చేసినా సిఎం పెద్దగా పరిగణలోకి తీసుకున్న దాఖలాలు లేవు. ఇలాంటి రాజకీయ కారణాల రీత్యా మావుడి సోదరులకు ఎమ్మెల్సీ పదవి దక్కలేదని తెలుస్తోంది. విజయనగరం జిల్లా మాదిరిగానే పార్వతీపురం మన్యం జిల్లాలో రెండో ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని మావుడి సోదరులు భావించారు. మావుడి సోదరులు ఇంతవరకు మండలంలో తమ పట్టు నిరూపించుకునే ప్రయత్నాలే వారు ఇంతవరకు చేశారు. కానీ తాము నియోజకవర్గ రాజకీయాలనూ ప్రభావితం చేయగలమనే సంకేతాలను వారు ఎన్నడూ పంపించలేదు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో మావుడి సోదరులకు ఎమ్మెల్సీ పదవి దక్కలేదనే చర్చ జరుగుతోంది.



సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

రాజకీయ హైడ్రామా

మావుడి సోదరుల విషయంలో గత కొద్ది రోజులుగా హైడ్రామాకు శుక్రవారం తెరపడింది. మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావునాయుడును డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సిఎం జగన్ మోహన్ వద్దకు తీసుకెళ్లడం ద్వారా వారి స్థాయిని పెంచే ప్రయత్నం జరిగింది. వారు కేవలం మండల నాయకులు మాత్రమే కాదని, నియోజకవర్గ, జిల్లా రాజకీయాలను కూడా ప్రభావితం చేయగలరనే విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనికి ముందు కొద్దిరోజులుగా మావుడి సోదరులు టిడిపిలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరిగింది. నామినేటెడ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు తర్వాత వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి కూడా దూరంగా వుండిపోయారు. రాజకీయంగా కీలకమైన పదవి ఇప్పించేందుకు పోయినా వారు కోరిన అభివృద్ధి పనులు సాధించామనే తృప్తి కలిగించడానికి శ్రీనివాసరావు నాయుడును సిఎం వద్దకు తీసుకెళ్లారనే వాదనలు వినిపిస్తున్నాయి. కోరుకున్న పదవి రాలేదని అసంతృప్తిని వీడి ఆశించిన అభివృద్ధి పనులు మంజూరు చేయించుకున్నామనే సంతృప్తితో వారు క్రియాశీల రాజకీయాల్లో మళ్లీ కీలకపాత్ర పోషిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, అధికారులు

14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

కలెక్టరేట్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 14న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ వైద్య, విద్యాశాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాలులో నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను కలెక్టరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని విద్యాసంస్థలకు మందుల పంపిణీకి ఎంపిడిఒలు నోడల్ అధికారులుగా ఉంటారని, శుక్రవారం నాటికి అన్ని విద్యా సంస్థలకు ఆల్బెండజోల్ మాత్రల సరఫరా పూర్తిచేసి, నివేదిక అందచేయాలన్నారు. జిల్లాలో గల విద్యాసంస్థల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, పాలిటెక్నిక్ కళాశాలలు, మొదటి సంవత్సరం డిగ్రీ కళాశాలలు మండల పరిషత్ కార్యాలయాల నుండి మాత్రలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడిసిసి పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి బి.జగన్నాథరావు, డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ తదితరులు పాల్గొన్నారు.

20న చలో విజయవాడ

సీతానగరం : అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతిలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఐసిడిఎస్ పిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఇంటి అద్దెలు, జీతాలు చెల్లించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతి పనిలోనూ అంగన్వాడీ ఉంటున్నారని, వారి సమస్యలు మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారీ ఎత్తున అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్తు అంతరాయం

సీతంపేట : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ 11/ కెవి పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇఇ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి సత్యంనాయుడు

విడివికెలను పనిలోకి తీసుకురావాలి

పాచిపెంట : వెలుగు ద్వారా నిర్వహిస్తున్న విడివికె (వన్‌దన్ వికాస్ కేంద్రాలు) పనిలోకి పెట్టాలని ఎపిడి వై.సత్యంనాయుడు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విడివికెల ద్వారా మండలంలో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులు చింతపండు 5టన్నుల వరకు కొనుగోలు చేసి వాటిని గ్రౌడింగ్ చేసి మహిళా సంఘ సభ్యులకు అందజేయాలని తెలిపారు. మండలంలో లభ్యం కాని చీపుర్లు, పసుపు, మక్కువ, సాలూరు మండలాల్లో విడివికెల నుంచి దిగుమతి చేసుకొని మహిళా సంఘ సభ్యులకు సరసమైన ధరలకు అందించాలని చెప్పారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటర్ నిర్మాణం పనులను పరిశీలించారు. సమావేశంలో ఎపిఎం పి.సత్యనారాయణ, సిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి శ్రీహరి

నెలాఖరులోగా పనులు పూర్తి

సీతానగరం : ఉపాధిహామీ పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఎపిడి జి.శ్రీహరి అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-22లో ఉపాధిహామీ పనులన్నీ నెలాఖరులాగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ అమృతసర్జన్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 2023 ఏప్రిల్ నుంచి జూలై వరకు ప్రతి కుటుంబానికి వంద రోజులు పని ఉండేలా ప్రణాళిక ఉండాలన్నారు. ప్రతి వేతనదారునికి పని కల్పించేలా ఆయా పంచాయతీల్లో ముందస్తు ప్రణాళిక ఉండాలని అన్నారు. కొత్త పనులు ప్లాన్ తయారు చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎపిఒ వి.భాను, ఇసి కృష్ణ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పిఒడబ్ల్యు నాయకులు రమణి

హక్కుల పరిరక్షణకు మహిళలు ఉద్యమించాలి

పార్వతీపురం రూరల్ : మహిళలు హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని మండలంలోని కోరీ వద్ద పిఒడబ్ల్యు జిల్లా శాఖ ఆధ్వర్యాన ర్యాలీ, సభ జరిగాయి. ఈ సందర్భంగా పిఒడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి, ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బొత్స నర్సింగరావు, అరుణోదయ రాష్ట్ర కోశాధికారి ఎస్.జయలక్ష్మి మాట్లాడారు. దేశంలో మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయని, నిందితులు సులువుగా శిక్షల నుంచి తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ముందు అందరూ సమానమని, చట్టాలు చెబుతున్నా పురుషులతో పాటు సమాన హక్కులు దక్కడం లేదని అన్నారు.మహిళలు తమ హక్కులను కాపాడుకోవడానికి పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుతూనే దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు సాగుతున్న పోరాటాల్లో భాగస్వామ్యమై పురుషులతో పాటు కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సర్వే వేగవంతం

వీరఘట్టం : మండలంలో జరుగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ విఆర్ఒలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో విఆర్ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా సర్వే పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలం పరిధిలోని కిమ్మిలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారికి పి.ఉమామహేశ్వరి వృద్ధులు, చంటి పిల్లలకు మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులకు సంబంధించి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవోనమ్మా, టెక్నీషియన్ దినేష్ 104 సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తీరని 'చింత'

- సిండికేట్‌గా మారిన దళారులు
- నష్టాలు చవిచూసిన గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో చింతపండు ఒకటి. ఇది గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిస్తుంది. అయితే దళారీలు సిండికేటుగా మారి వారు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు జిసిసి కొనుగోలు చేసిన అది రేటు గిట్టుబాటుకాక గిరిజనులు నష్టపోతున్నారు. అటు జిసిసి తీరు, ఇటు దళారీల మోసం మధ్య గిరిజనులు నలిగిపోతున్నారు.

సీతంపేట ఏజెన్సీ చింతపండు ఎంతో పేరుంది. ఎందుకంటే ప్రకృతి సిద్ధంగా పండుతున్న పంట. మైదాన ప్రాంత చింతపండు కన్నా ఇక్కడ చింతపండు తక్కువ వాడినా ఎంతో రుచిగా ఉంటుందని మైదాన ప్రాంత ప్రజలు చెప్తుంటారు. అయితే ఈ ఏడాది సీతంపేట ఏజెన్సీలో సుమారు పదివేల ఎకరాల వరకు పంట కాపుకు వచ్చింది. అయితే ధర మాత్రం ఒకసారిగా పడిపోయింది. బయట మార్కెట్లో రూ.40 పైనే పలుకుతుంది.

సంతలో చింతపండు విక్రయిస్తున్న గిరిజనులు

మరోవైపు సంతల్లో కావిడిలు చొప్పున చింతపండు రూ.600 నుంచి రూ.800 మించి పలకడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, ఒడిశా భువనేశ్వర్, పర్లాకిమిడి, కటక్ తదితర పట్టణాల నుంచి దళారీలు సంతలకు వచ్చి సిండికేట్ మారడంతో కారు చౌకగా చింతపండు కొనుగోలు చేసి వాహనాలు ద్వారా రవాణా చేసి పట్టణాలు, నగరాల్లో అధిక ధరలకు విక్రయించి లాభాలు అర్జిస్తున్నారు. మరోవైపు గిరిజనులు కొండ పైనుంచి తెచ్చిన చింతపండు తిరిగి తీసుకొని వెళ్లలేక దళారులకు ఎంతో కొంత ఇచ్చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్ ఉన్నప్పటికీ మరమ్మతులు గురవ్వడంతో అది ఉపయోగంలో లేదు. ఇప్పటికే జిసిసి కిలో చింతపండు రూ.32.40 మాత్రమే ధర ప్రకటించింది. జిసిసి ప్రకటించిన ధరను నిరసిస్తూ గిరిజనులు ఆ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నిరసన తెలిపారు. కిలో రూ.50 మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గిరిజనుల కష్టం దళారీల పాలవుతోంది. ఇప్పటికైనా అధికారులు జిసిసి అధికారులు స్పందించి చింతపండు కిలో రూ.50 మద్దతు ధర ప్రకటించిన తమను ఆర్థికంగా ఆదుకోవాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

కాపు బాగా వచ్చింది...

గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చింత పంట బాగానే వచ్చింది. కానీ ధర మాత్రం ఎక్కువ పలకడం లేదు. వాతావరణం మబ్బుగా ఉండడం, ధర తక్కువ పలకడంతో చింతపండు తక్కువగా ఏరుతున్నాం.

సవర లక్కాయి,
లోవ గూడ.

కిలో రూ.50కు కొనుగోలు చేయాలి

గత ఏడాది పంట ఆశించిన స్థాయిలో రాలేదు. అంతకు ముందు రెండేళ్లు కరోనా వల్ల పంట సేకరించలేదు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున జిసిసి కిలో చింతపండు రూ.50కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

జీలకర్ర శ్రీరాములు,
గిరిజన సంఘం నాయకులు.

జెడ్‌పిటిసి ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎప్పుడెప్పుడా ఎదురుచూస్తున్న జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. కొద్దిరోజుల్లో ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. దీనిలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల అధికారులు పోలింగ్ కేంద్రాల జాబితాను శుక్రవారం విడుదల చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ పార్వతి మండలంలోని 29పంచాయితీలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాను ఓటర్ల పరిశీలనార్థం కార్యాలయంలో వేలాడదీశారు. జెడ్పీ వైస్ చైర్మన్ అంబటి అనిల్ కుమార్ మృతితో జెడ్పీటీసీ ఉపఎన్నిక అనివార్యమైంది.

రూ.4.5 కోట్లతో టిటిడి ఆలయ నిర్మాణ పనులు

సీతంపేట : మండల కేంద్రంలో గల తూరాయిపువలస సమీపానున్న టిటిడి దేవస్థానం రూ.4.5 కోట్లతో దేవాలయ నిర్మాణం, కల్యాణమండపంలో మౌలిక సదుపాయాలు త్వరగా పూర్తి చేయాలని టిటిడి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి గుణ భూషణ్ రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం టిటిడి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గజ స్తంభం ఏప్రిల్ 17న గజ స్తంభం శంకుస్థాపన చేయాలన్నారు. పనులు నాణ్యతగా చేయాలన్నారు. దాదాపు పనులు పూర్తి చేశామని తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ అసిస్టెంట్ ఎఇ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూరల్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిడిపిఒ విజయలక్ష్మికి ఉమ్మడి సెలవు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ అంగన్వాడీలకు పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెంచాలని వేతనాలు పెంచాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలపై సచివాలయాల పర్యవేక్షణ పేరుతో వేధింపులకు పాల్పడవద్దన్నారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఈ నెల 20న అంగన్వాడీలు మాస్ లీవ్ పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జి.జ్యోతి, పి.నిర్మల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

13న ప్రత్యేక సాధారణ సెలవు

కలెక్టరేట్ : శాసన మండలి ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈనెల 13న ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ వారి ఓటు హక్కు వినియోగించుకొనేందుకు గానూ మార్చి 13న ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

పింఛనుదార్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విశ్రాంత ప్రభుత్వ పింఛనుదార్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంట జగన్నాధరావు, దొడ్లంకి గణపతిరావు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ దశలవారీ పోరాటంలో భాగంగా శుక్రవారం వీరు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు, ఆర్‌డిఒ కె.హేమలతకు, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు, ఎటిఒకు, డిస్ట్రిక్ట్ ట్రెజరీకి, తహశీల్దార్‌కు, పలువురు అధికారుల వినతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జూలై 2018 నుంచి బకాయి పడ్డ డిఆర్ ఎరియర్లు సత్వరమే చెల్లించాలని, 11వ పిఆర్‌సి ఎరియర్లు చెల్లించాలని, ఫే ఫిక్షేషన్, స్టేట్మెంట్ ఇవ్వాలని, జూలై 2023 నుంచి నూతన వేతన సవరణలు అమలు చేయాలని, తక్షణమే 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అలాగే హెల్త్ కార్డులపై కేస్ లెస్ ట్రీట్మెంట్ అన్ని హాస్పిటళ్లలో అన్ని వ్యాధులకు అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని, ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ తమ ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, సెప్టెంబర్ 2018 ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి ఏటా పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్‌లు చేయాలని, పెన్షనర్లకు సంబంధించిన నాన్ ఫైనాన్షియల్ విషయంలో సిఎఫ్ఎంఎస్‌కు సంబంధం లేకుండా సబ్ ట్రెజరీలోనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న పింఛనర్లు

కురుపాం : పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి కి మండల, తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు టి. పాండురంగారావు ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పెండింగ్ లో ఉన్నటువంటి ఎరియర్లు బకాయిలు సత్వరం చెల్లించి ప్రస్తుతం బకాయి ఉన్న డి ఆర్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేసి తమను ఆదుకునేలా చూడాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్లు టి.రామరావు,ఎం. ప్రకాష్ రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణా శాఖ సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రమేష్‌కుమార్ అన్నారు. పార్వతీపురం సురేష్ పాఠశాలలో శుక్రవారం రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని రవాణాశాఖ నిర్వహించింది. విద్యార్థి దశలో నిబంధనలు పాటించడం వల్ల అలవాటుగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. మంచి అలవాటు జీవితానికి మంచిదని చెప్పారు. అందరూ రహదారులను ఉపయోగిస్తారని, అయితే కొద్దిపాటి అవగాహనతో ప్రమాదాలు నివారించవచ్చని ఆయన అన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వారికి, స్నేహితులకు తెలియజేయాలని తెలిపారు. తద్వారా అందరూ నిబంధనలు పాటించి సంతోషంగా ఉండగలరని చెప్పారు. అధిక వేగం ప్రమాదాలకు కారణమవుతుందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించక, వేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, కుటుంబాలు కష్టాల్లో పడుతున్నాయని చెప్పారు. రహదారి దాటేటప్పుడు రెండు వైపులా గమనించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ వైద్యులు డాక్టర్ డి.నారాయణరావు, ఎఎస్ఐ టి.భాస్కరరావు, పాఠశాల ప్రిన్సిపల్ సాహు, కరస్పాండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ రమేష్‌కుమార్

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

తాగునీటి కోసం శుక్రవారం పట్టణంలోని ఏడో వార్డులో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా కౌన్సిలర్ దిబ్బ సునీత మాట్లాడుతూ ఏడో వార్డులో ఎనిమిది రోజుల నుంచి తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎనిమిది రోజులుగా తాగునీరు ఇవ్వకపోతే ఎలా జీవించాలని ప్రశ్నించారు. తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బలిజిపేట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత పైపులైన్‌కు నూతన పైపులైన్ అనుసంధానం చేయడం వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. రోడ్డుకు ఎడమ వైపు పనులు పూర్తయిన ప్రాంతానికి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ నెల 9న కొన్ని ప్రాంతాలకు, 10న మిగిలిన ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేశామన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

సెంచూరియన్ యూనివర్సిటీ విసి జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం సెంచూరియన్ యూనివర్సిటీలో అంతర్ విశ్వ విద్యాలయాల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంచేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు వివిధ రకాల క్రీడా పోటీలు ఉంటాయన్నారు. ఎక్కువ బంగారు పతకాలు సాధించిన వారికి అదనంగా తాను రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తానని ప్రకటించారు. అనంతరం 100 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తరంగ్ మేనేజింగ్ డైరెక్టర్ బాబు శంకర్, ఒడిశా క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ పాడి, స్పోర్ట్స్ డైరెక్టర్ రబి నారాయణ్ రౌత్రే, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, డాక్టర్ సన్నీ డియోల్, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జియ్యమ్మవలస : మండలంలోని డంగభద్ర శివారులో పంట పొలాల్లో గుర్తుతెలియని వృద్ధుని శవం శుక్రవారం ఉదయం గుర్తించినట్లు ఎస్సై పి.అనీష్ తెలిపారు. లభ్యమైన శవం సుమారు 60 ఏళ్ల పైబడి ఉంటుందని ఆచూకీ తెలిసిన వారు జియ్యమ్మవలస పోలీసులకు సమాచారాన్ని అందించగలరని ఎస్సై కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

పాలకొండ : ఈనెల 9న పట్టణంలో వీరఘట్టం రోడ్డులో నిల్చొని ఉన్న పవన్ కుమార్ అనే వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో పవన్ మృతి చెందాడు. దీనిపై శుక్రవారం డిఎస్‌పి జి.కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు లారీ నడిపిన ఆర్.గణపతి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. సాలూరుకు చెందిన గణపతి తాగిన మైకంలో డ్రైవ్ చేసి నిండు ప్రాణాన్ని బలితీశాడని డిఎస్‌పి తెలిపారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపడానికి అవకాశం ఇచ్చిన లారీ యజమాని ఎం.ఈశ్వరరావుపై కూడా ఎ2గా కేసు నమోదు చేసినట్టు చెప్పారు. లారీ ఓనర్లు లైసెన్స్‌లున్న డ్రైవర్లనే నియమించాలని, లేని పక్షంలో ఓనర్లే ముద్దాయిలవుతారని అన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడపరాదని, నెంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడిపినా సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు సిఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి పంచాయతీ రెల్లి కాలనీలో మేడిశెట్టి సత్తిబాబుకు చెందిన ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన జరగడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం కాలి బూడిదైంది. కుటుంబమంతా కట్టు బట్టలతో మిగిలారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వేపాడ : మండలంలోని సంజీవిమెట్ట వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన కొటాన అప్పలనాయుడు (48) గురువారం రాత్రి కడుపునొప్పితో బాధపడుతూ మందుల కోసం ద్విచక్రవాహనంపై అదే గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి నాయుడుతో కలిసి దేవరాపల్లి వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా వేపాడ మండలంలోని సంజీవిమెట్ట వద్ద కొత్తవలస-దేవరాపల్లి రోడ్డుపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. ఎదురుగా వచ్చి ఢీకొట్టిన వ్యక్తి ద్విచక్రవాహనాన్ని వదిలి పరారయ్యాడు. క్షతగాత్రులిద్దరినీ 108 వాహనంలో కె.కోటపాడు ఆస్పత్రికి స్థానికులు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అప్పలనాయుడు మృతిచెందాడు. అప్పలనాయుడు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్ కేసు నమోదు చేశారు.

విత్తన గుళికలు రైతులకు వరం

ప్రజాశక్తి - సాలూరురూరల్

విత్తన గుళికలు రైతులకు వరమని, ఖరీఫ్, రబీ సీజన్ల అనంతరం కొంత ఖాళీ సమయంలో విత్తన గుళికలను తయారు చేసుకొని వేసుకొంటే అవి పంట వేసే సమయానికి మొలకెత్తి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం డిపిఒ ధనుంజయ్ రావు పేర్కొన్నారు. మండలంలోని మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయదారు తాడుతూరి ఈశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికలు ఆవశ్యకతను వివరించారు. పోడు, వర్షాధార వ్యవసాయ భూముల్లో పండించే పంటలకు సంబంధించిన విత్తనాలను ముఖ్యంగా చిరుధాన్యాలైన జొన్నలు, గంటెలు, శెనగలను బంతులుగా తయారు చేసుకొని ఆరు నెలల తర్వాత పొలంలో చల్లుకొని అదునుకు వ్యవసాయం చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల భూమికి నిరంతరం బలం చేకూరుతుందని, పంట దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. విత్తన బంతుల తయారీ విధానం, పొలంలో నాటుటకు ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి నీడలో అరబెట్టుకోవాలని తెలిపారు. ఆతర్వాత విత్తనాలను ఒక గోనె సంచిపై వేసి కావాల్సిన నీరు చిలకరిస్తూ మెత్తటి బంక మట్టిని చల్లుకోవాలన్నారు. ఆ తర్వాత మెత్తగా తయారు చేసిన ఘన, జీవామృతం చల్లుతూ నీటిని చీలకరిస్తూ ఉండాలని తెలిపారు. మూడో పొరగా మెత్తటి బూడిదను చల్లి గోనె సంచిను రెండు వైపులా పట్టుకొని ఊపుతూ వుంటే విత్తన బంతులు తయారవుతాయని అన్నారు. అలా తయారైన విత్తన బంతులు ఆరు నెలలు వరకూ జీవం పోకుండా వుంటాయి. కార్యక్రమంలో ఎంటిఎం యశోదమ్మ, డివిజన్ ఇంఛార్జి కె.బాలకృష్ణ, సత్యనారాయణ, సూరిబాబు, రంగా, తిరుపతిరావు, రైతులు బుస తవుడు, పార్వతి, కుమారి, గంగమ్మ, అప్పల నాయుడు, లక్ష్మణ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేటలో జిఎపి క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఎపిసిఎన్ఎఫ్ వారితో పాటుగా నవధాన్యాలు సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేష్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల వారి భూమిలో పోషక విలువలు ఎక్కువగా పెరుగుతాయని, సేంద్రీయ కర్బనం అధికంగా ఉత్పత్తి అవుతుందని, దాని ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చని అన్నారు. వేరు వ్యవస్థలో నత్రజని, భాస్వరం విలువలు అధికంగా ఉంటాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి అవినాష్ మాట్లాడుతూ రైతులు వేసవిలో దుక్కులు చేసుకోవడం వల్ల నేల గుల్లబారి, కాండం తొలుచు పురుగు ఉంటే దాని అవశేషాలు తొలగించవచ్చని అన్నారు. అలాగే ఆర్‌బికె ద్వారా ముందు గానే డిఎపి నిల్వలను ఇవ్వడం జరుగుతుందని, కావున రైతులు వారికి కావాల్సిన మోతాదు తెలియచేయాలని తెలిపారు. ఇకపై ప్రతి మంగళ, బుధ వారాల్లో జిఎపి క్లస్టర్ పొలంబడి ఆర్.వెంకంపేట గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం ద్వారా రైతులను తమ పొలాల్లో శాస్త్రవేత్తలుగా తయారుచేసే దిశగా తీసుకుని వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు : జీవామృతం తయారీని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట: మండలంలోని చినబగ్గ పంచాయతీ పరిధిలో మోహన కాలనీలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరావు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల ఉపయోగాలు తెలియజేస్తూ ప్రతి రైతు పోడు వ్యవసాయం చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పద్ధతులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఊయక మంగయ్య, వెలుగు అసోసియేషన్ నుంచి బి వెన్నెల, బి.వసంత, ఎసిఒ పార్వతి, ఉమా, సిఒ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.